వేసవి దుక్కులు.. చీడపీడలు పరుగు

- లోదుక్కులతో భూసారం పెంపు
- చీడపీడలు, కలుపు నివారణ
- వాలుకు అడ్డంగా దున్నడంతో నీటి నిల్వ శక్తి పెరుగుదల

బేస్తవారిపేట:

పంట కోతలు దాదాపు పూర్తయ్యాయి. అయితే వర్షాకాలం వచ్చేంత వరకు నేలను దుక్కి చేయకుండా వదిలేస్తే భూములు నిర్జీవంగా మారుతాయి. వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి. తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు, చీడ పురుగులు భూమిలో ఉంటాయి. వేరుశనగ, పప్పుశనగ, కంది, మిరప పంటలు వేసినప్పుడు లద్దె పురుగులు భూమిలో ఉండిపోతాయి. ఈ వేసవిలో లోతైన దుక్కులు చేస్తే నేలలో ఉన్న చీడ పురుగులు, గుడ్లు, కోశాలు బయటపడి చనిపోతాయి. కొంగలు, కాకులు, పిచ్చుకలు తదితర పక్షులు వాటిని తిని నాశనం చేస్తాయి. అలాగే కలుపును కూడా నివారించవచ్చు. వేసవి దుక్కులతో వర్షపు నీరు లోపలి పొరల్లోకి ఇంకి భూమి సారాన్ని పెంచుతుంది. దుక్కి చేయకుండా భూమిని ఖాళీగా వదిలేయడం వల్ల కలుపు మొక్కలు, ఇతర గడ్డి జాతి మొక్కలు పెరిగి భూమిలోని తేమను, పోషకాలను గ్రహించి భూమిని సత్తువ లేకుండా నిర్వీర్యం చేస్తాయి. జిల్లాలో రబీ సీజన్‌లో 2.99 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేశారు.


వేసవి దుక్కులు చేసిన పాలం

వాలుకు అడ్డంగా..

వేసవి దుక్కులు వాలుకు అడ్డంగా లోతుగా చేపట్టాలి. ఇలా చేయడం వల్ల వర్షాలు పడినా భూసారం బయటకు కొట్టుకుపోదు. పొలం గుల్లగా ఉండటం వల్ల వర్షాలు కురిసే సమయంలో ఆ నీరు భూమిలో ఇంకిపోతుంది. దీని వల్ల భూ అంతర్భాగంలో నీటి నిల్వలు చెక్కు చెదరవు. తేమను నిలుపుకునే సామర్థ్యం పెంచేందుకు దుక్కుల సమయంలో పశువుల పేడ చల్లి ఎద్దులతో దున్నడం మంచి పద్ధతి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులు ఈ విధానంపై దృష్టి సారించాలి. మార్చి రెండో వారం నుంచి మే రెండో వారం వరకు వేసవి దుక్కులకు అనుకూలం. రానున్న ఖరీప్ పంటకు సంబంధించి ఇప్పటి నుంచే రైతులు వేసవి దుక్కులు చురుకుగా చేపడుతున్నారని మండల వ్యవసాయ అధికారిణి జక్కం మెర్సీ చెప్తున్నారు.

ప్రయోజనాలు ఇవీ.

- సమగ్ర సస్యరక్షణలో భాగంగా వేసవిలో లోతు దుక్కులను చేయడంతో పురుగు మందుల ఖర్చు తగ్గి వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.
- వర్షాలకు ముందు భూమిని వాలుకు అడ్డంగా దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు నేలలోనికి ఇంకుతుంది.
- ఈ దుక్కులతో ఇతర గడ్డిజాతి మొక్కల విత్తనాలు కూడా వేసవి ఉష్ణోగ్రతలకు గురై మొలిచే శక్తిని కోల్పోతాయి.
- దుక్కుల అనంతరం ఎకరాకు రెండు టన్నుల చొప్పున పశువుల ఎరువులు పొలంలో చల్లుకోవాలి. దీంతో పంటకు కావాల్సిన సూక్ష్మపోషకాలు కూడా సమృద్ధిగా అందుతాయి.
- వేసవిలో దుక్కి దున్నితే భూమి గుల్లగా మారుతుంది. దీంతో భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరగడమే కాకుండా, తేమలో జీవించే వానపాముల సంతతి వృద్ధి చెందుతుంది. ఇవి భూసార పరిరక్షణకు దోహదపడతాయి.


దుక్కులు చేసిన పాలంలో సేంద్రియ ఎరువు కుప్పలు

- లోతు దుక్కులు చేయడంతో వరిలో కాండం తొలుచు పురుగు, లద్దె పురుగు, పత్తిలో లద్దె పురుగులు, శనగపచ్చ పురుగులు, మిరపలో కాయతొలుచు పురుగులు నశిస్తాయి.
- పొలంలో గత పంట అవశేషాలుంటే లోతుగా దున్నడంతో భూమిలో కలిసిపోతాయి. ఫలితంగా సేంద్రియ ఎరువుగా మారి భూమి సారాన్ని పెంచుతుంది.

వేసవి దుక్కులు ఎంతో ఉపయోగం

వేసవి దుక్కులు చేసుకోవడంతో ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భూమిలో ఉన్న చీడ పురుగుల గుడ్లు బయటపడి నశిస్తాయి. పురుగు మందుల ఖర్చు తగ్గుతుంది. రబీ తరువాత భూమిని వాలుకు అడ్డంగా వేసవి దుక్కులు వేయాలి. తొలకరి వర్షాలు పడినప్పుడు నీరు భూమిలోకి ఇంకిపోయి నేల సారవంతం అవుతుంది. వాతావరణ కాలుష్యం తగ్గుతుంది.

– జక్కం మెర్సీ, ఏవో, బేస్తవారిపేట

తూతూమంత్రంగా సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధ్యక్షుడు ఖాజామియా


సమావేశం నుంచి వెళ్లిపోతున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ హాలులో శనివారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా సాగింది. మండల ఉపాధ్యక్షుడు డీ ఖాజామీయా అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. గలిజేరుగుళ్ల ఎస్సీకాలనీలో బోరు పూడిపోయిందని, నూతన బోరు ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ కోరారు. సర్పంచ్ నిధులు లేవు అంటున్నాడని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ తావూ నాయక్ మాట్లాడుతూ మండల పరిషత్, సర్పంచ్ నిధులతో బోరు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖకు ప్రత్యేక నిధులు ఏమీ లేవన్నారు. మోక్షగుండం జగనన్న లేఅవుట్ వివరాలు ఇవ్వాలని పలుమార్లు కోరిన ఎందుకు ఇవ్వడంలేదని సర్పంచ్‌లు కోరారు. కలెక్టర్ కార్యాలయానికి దరఖాస్తు పెట్టుకోవాలని ఆర్ఐ కాశయ్య తెలిపారు. దీంతో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మీ పరిధిలో ఉండే సమాచారం ఇవ్వకపోగా నిర్లక్ష్యపు సమాధానం చెప్తారా అంటూ సభను బహిష్కరించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు బయటకు వెళ్లిపోవడంతో ప్రశ్నలు ఏమీ లేకుండానే తూతూమంత్రంగా సభను ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు నిర్వహించారు. జెడ్పీ నిధులు బేస్తవారిపేట మండలంలో 8 వర్క్‌లకు రూ.16 లక్షలు, జెడ్పీ నిధులు ఎమ్మెల్యేకు రూ.12 లక్షలు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ శ్రీనివాసనాయక్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గవర్నర్ ఏడీసీ పూజలు


పూజలు చేస్తున్న రామాంజనేయులు

మార్కాపురం: లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఏడీసీ, అదనపు ఎస్పీ ఎస్‌వీ రామాంజనేయులు శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి గర్భాలయంలో అర్చకులు అప్పనాచార్యులు, రామాంజనేయులతో ప్రత్యేక పూజలు చేయించి స్వామివారి ప్రాశస్త్యాన్ని వివరించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం బహూకరించారు. రాజ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 2017లో ఆయన మార్కాపురం డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. అప్పట్లో రాష్ట్రంలోనే తొలిసారిగా హైవే రోడ్లపై యాక్సిడెంట్ల నివారణకు ఫేస్‌వాష్ కార్యక్రమాన్ని ప్రారంభించగా ఇప్పుడు రాష్ట్రమంతా అమలు జరుగుతోంది.

మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్నచార్లెస్ హర్షవర్ధన్

గిద్దలూరు రూరల్: మహిళలు బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలోపేతం కావాలని స్త్రీ నిధి ఏజీఎం చార్లెస్ హర్షవర్ధన్ అన్నారు. స్థానిక వెలుగు డీఆర్‌డీఏ కార్యాలయంలో శనివారం డ్వాక్రా మహిళలకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్త్రీ నిధి ద్వారా రుణాలను పొందిన మహిళలు త్వరగా వారి రుణాలను చెల్లించి కొత్త రుణాలను తీసుకునేలా ఉండాలన్నారు. పేటీఎం మిషన్‌ల ద్వారా కూడా రికవరీలు, గ్రామస్థాయిలో రికవరీలు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గిద్దలూరు క్లస్టర్ కో ఆర్డినేటర్ కె.లక్ష్మీరెడ్డి, ఏపీఎం కె.నరేష్, సీసీలు శిరీష, వెంకటేశ్వర్లు, కల్పన, రంగనాయకులు, పాల్గొన్నారు

ఉపాధి పనుల తనిఖీ

తర్లుపాడు: మండలంలోని బుడ్డపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపీడిఓ చక్రపాణి ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. కూలీలకు తప్పనిసరిగా రూ.307 వేతనం వచ్చేలా చూడాలని, పనికిరాని వారి పేరున మస్టర్లు వేస్తే చర్యలు తప్పవని ఫీల్డు అసిస్టెంట్‌ని హెచ్చరించారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ నిధులతో నూతనంగా నిర్మించిన పశువుల తొట్లను పరిశీలించారు. ఈసీ సుభద్రాదేవి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

వార్డెన్‌ను సన్మానించిన అధికారులు


లక్ష్మీకాంతరెడ్డిని సన్మానిస్తున్న ఎంఈఓలు

బేస్తవారిపేట: స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో గలిజేరుగుళ్ల బీసీ హాస్టల్ వార్డెన్ కొండా లక్ష్మీకాంతరెడ్డిని శనివారం విద్యాశాఖ అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు కాశయ్య, సీహెచ్ రమణారెడ్డిలు మాట్లాడుతూ బీసీ హాస్టల్ చదువుకుంటూ గత ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో భరత్‌కుమార్ స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించాడని, ఈ ఏడాదిలో జీ నారాయణ 571 మార్కులతో జిల్లా సెకండ్ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. హాస్టల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఎంతో సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఇండేలా రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

అర్ధనారీశ్వర తత్వం ఆదర్శం

మార్కాపురం టౌన్: ఆధునిక వైవాహిక జీవితానికి పార్వతీ పరమేశ్వరుల అర్ధనారీశ్వర తత్వం ఆదర్శంగా నిలుస్తుందని జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకుడు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. శనివారం రాత్రి మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో రెంటచింతల సీతా మహాలక్ష్మి స్మారక ఉపన్యాసంలో అర్ధనారీశ్వర తత్వం ఆధునిక వైవాహిక జీవితం అనే అంశంపై మాట్లాడారు. కొత్తగా వివాహమైన నూతన దంపతులు అర్ధనారీశ్వర తత్వాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా నిండు నూరేళ్ల భార్యాభర్తలు రెండు శరీరాలు, ఒక ఆత్మగా గడపవచ్చన్నారు. దీని వలన కుటుంబ, సమాజ, ప్రపంచ శ్రేయస్సు ముడిపడి ఉంటుందన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంబయ్య శాస్త్రీ, సీనియర్ అడ్వకేట్ పురాణం సుబ్రమణ్యం, కవులు కెవి రమణారెడ్డి,రఫీ, ఎంవీ రమణ, తోట శ్రీనివాసరావు, మధుసూదనరావు, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు వీల్‌చైర్ బహూకరణ


వీల్‌చైర్‌లు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

మార్కాపురం టౌన్: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో జీజీహెచ్‌కు 2 వీల్‌చైర్లను శనివారం సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు వైచలమయ్య, గుంటక చెన్నారెడ్డిలు డిప్యూటీ సూపరింటెండెంట్ శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాగులూరి రామసుబ్బయ్యను వైద్యశాల సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఆర్కేజే నరసింహం, పీవీ కృష్ణారావు, దేవకి సత్యనారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానితులపై నిఘా ఉంచాలి

కంభం: లాడ్జీలో గదులు అద్దెకు తీసుకునే వారి వివరాలు రిజిస్టర్‌లో కచ్చితంగా నమోదు చేసుకోవాలని ఎస్సై నరసింహారావు సూచించారు. పట్టణంలోని లాడ్జీలను శనివారం సాయంత్రం సిబ్బందితో కలసి ఎస్సై ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రిజిస్టర్లు పరిశీలించి గదుల్లో ఉన్న వారితో మాట్లాడి వివరాలు సేకరించారు. ఇటీవల నేరాలు, దొంగతనాలు అధికమైన నేపథ్యంలో లాడ్జీలపై పోలీసుల నిఘా ఉంటుందన్నారు.

బేస్తవారిపేట: స్థానిక బస్టాండ్, జంక్షన్‌లో వాహనాలను ఎస్సై ఎస్వీ రవీంద్రారెడ్డి తనిఖీ చేశారు. జంక్షన్‌లోని పలు లాడ్జిలను తనిఖీ చేలు చేశారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైన సంచరిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు.


కంభం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందువులు

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

కంభం: జమ్ముకాశ్మీర్‌లో జరిగిన ఉగ్రవాద దాడిని నిరసిస్తూ శనివారం పట్టణంలో హిందువుల ఆధ్వర్యంలో ర్యాలీ శాంతియుత ర్యాలీ చేపట్టారు. జాతీయ జెండాలు, ప్లకార్డులు చేతపట్టి స్థాని గచ్చు కాలువ వీధి నుంచి చౌక్ సెంటర్ మీదుగా కందులాపురం కూడలీ వరకు ర్యాలీ చేపట్టి కందులాపురం కూడలీలో మానవ హారం నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి ఉగ్రవాదుల దాడిలో మృతిచెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు జి.రవీంద్రారెడ్డి అన్నారు. పహల్గామ్‌లో జరిగిన ఘటనకు నిరసనగా విశ్రాంత ఉద్యోగులు పట్టణంలోని పలు వీధుల్లో కొవ్వత్తుల ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు రంగన్న, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.


గిద్దలూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం


పొదిలిలో మాట్లాడుతున్న అధికారులు

పొదిలి రూరల్: బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్‌కు కిశోరి వికాసం ఎంతగానో దోహదపడుతుందని నగర పంచాయతీ కమిషనర్ కేఎల్ నారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కిశోరి వికాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, ఆర్థిక ఇబ్బందులు, కళాశాలలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో చాలామంది బాలికలు చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ముందుగా కిశోరి వికాసంలో 14 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్న బాలికల వివరాలను తెలుసుకొని, వారిలో ఏఏ కారణాలతో ఎంత మంది చదువు మధ్యలో ఆపేసిన వారు ఉన్నారో వివరాలు సేకరిస్తారన్నారు. గ్రామస్థాయిలో గ్రూపులుగా చదువుపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శోభన్‌బాబు, ఎంఈఓ ఎం శ్రీనివాసరెడ్డి, ఏపీవో గోపాలకృష్ణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు ఆకస్మిక తనిఖీ


జైలులో సరుకులను పరిశీలిస్తున్న జడ్జి

గిద్దలూరు రూరల్: పట్టణంలోని స్థానిక సబ్ జైలును గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జైలు లోని ఖైదీలను ఉంచే గదులను పరిశీలించారు. నిత్యావసరాలు, వంట గదులను పరిశీలించారు. జైలులోని ఖైదీలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమం ద్వారా ఖైదీలకు చట్టాల పై అవగాహన కల్పించారు. మే నెల 10వ తేదీన జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్ ను 5వ తేదీనే నిర్వహించనున్నామని చెప్పారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఎరుకలకు భూములు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పోచయ్య

రాచర్ల: ఎరుకుల కుటుంబాలకు భూములు కేటాయించి వారిని ఆర్థికంగా ఎదుగేందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఎన్‌జీవో ఎమ్ఎఫ్‌పీ బ్యాంబూ సొసైటీ అధ్యక్షుడు కే.పోచయ్య అన్నారు. మండలంలోని ఆకవీడు గ్రామంలో ఎస్టీకాలనీలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. గుంటూరు హెడ్ ఆఫ్ ది ఫారెస్టు ప్రిన్సిపాల్ చీఫ్ సెక్రటరి వారు రెండేళ్లకోసారి మంజూరు చేసే 2 వేల వెదురు బొంగులు కుటుంబానికి పోషించుకోవడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అంతేకాక అటవీశాఖ అధికారులు ఆకవీడు సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతానికి ఆదివాసులను వెళ్లనివ్వడం లేదని దీంతో ఆదివాసులు చేతి వృత్తుల పనులు కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సంవత్సరానికి ఒక్కసారి ఐదు వేల ఎదురు బొంగులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రతి కుటుంబానికి 5 ఎకరాల అసైన్‌మెంట్ భూమిని మంజూరు చేయడమే కాకుండా ఎఫ్‌ఆర్‌ఏ సర్టిఫికెట్ మంజూరు చేయాలని వివరించారు. కార్యక్రమంలో దేవరకొండ పద్మా, పాముసాని రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేయాలని వినతి


సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: పెద్దారవీడు మండలంలోని గుండంచర్ల గ్రామ సమీపంలో వేంచేసి ఉన్న వేణుతల కాటమరాజు గంగాభవానీ స్వామివారి దేవస్థానంలో పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ దేవస్థాన కమిటీ అధ్యక్షులు గంగరాజు, బుర్రి చిన్న వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు శనివారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. దేవస్థానికి చెందిన భూములను డ్రోన్ సహాయంతో సర్వే చేయించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న రోడ్డు ముంపు గ్రామాల పరిధిలో ఉండటం వలన ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణానికి అనువుగా కొన్నిప్రాంతాలను పరిశీలించామని, బీ చెర్లోపల్లి శివాలయం నుంచి కలనూతల గ్రామం వరకూ కొత్త రోడ్డు వేసేందుకు అనువుగా ఉందని, అలాగే దోర్నాల మండలం అగ్రహారం నుంచి కలనూతల గ్రామం వరకు రోడ్డు వేసేందుకు అనువుగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జి చిన్నఎల్లయ్య, కాటమరాజు, చక్రపాణి, బాలనాగయ్య, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

మార్కాపురం టౌన్: మున్సిపాలిటీలో ఇల్లు కట్టుకునేందుకు అనుమతులను త్వరగా మంజూరు చేస్తామని, నిబంధనలు పాటించి గృహ యజమానులు దరఖాస్తులు చేసుకోవాలని కమిషనరు డీవీ నారాయణరావు తెలిపారు. శనివారం తన చాబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ద్వారా లబ్ధిదారులు స్వీయ ధ్రువీకరణ పథకంలో భాగంగా అంగీకారపత్రాన్ని కార్యాలయంలో సమర్పించి సులభతరంగా భవన నిర్మాణ అనుమతులు పొందవచ్చన్నారు. లైసెన్సు పొందిన టెక్నికల్ సర్వేయరు, ఇంజనీర్ల ద్వారా గ్రామ కంఠం, అధికారిక లేఅవుట్లు, మొదలగు ప్రాంతాల్లో నివాసం కోసం భవన నిర్మాణ అనుమతుల కోసం స్వీయ ధ్రువీకరణ పత్రం అందించాలన్నారు. ఆసక్తి గల ఐటీఐ, సివిల్, డిప్లమో సివిల్, బీటెక్ సివిల్ పూర్తిచేసిన అభ్యర్థులు లైసెన్సు టెక్నికల్ పర్సన్ సర్వేయరు ఇంజినీర్ల లైసెన్సు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని లైసెన్సు పొందవచ్చని తెలిపారు.

మేం ఎవరి ఆస్తిని ఆక్రమించలేదు


డాక్యుమెంట్లు చూపుతున్న వెంకటరెడ్డి

మార్కాపురం: పట్టణంలోని తూర్పువీధిలో నివాసముంటున్న తాము ఎవరి ఆస్తిని ఆక్రమించలేదని గొలమారి వెంకటరెడ్డి, సాయికుమార్‌రెడ్డిలు తెలిపారు. శనివారం వారు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సర్వేనంబరు 1132/3లో షెడ్యూల్ ఆస్తి వారసత్వంగా వచ్చిందన్నారు. అందులో కొంత భూమి ఒంగోలు–కర్నూలు జాతీయ రహదారి నిర్మాణంలో భూసేకరణలో పోయిందని, మిగిలిన భూమిని తాము సాగుచేసుకుంటున్నామని అన్నారు. అయితే తమ సోదరుడు గొలమారి నారాయణరెడ్డి, ఆయన కుమారుడు శివారెడ్డిలు తమపై నిరాధార అసత్య ఆరోపణలు చేశారన్నారు. రాజకీయ కోణంలో వారే తమను బెదిరిస్తున్నారని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. చట్టరీత్యా తమకు అన్నీ హక్కు పత్రాలు ఉన్నాయని, సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలు చేస్తున్నారని చెప్పారు. ఎవైనా సమస్యలు ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకుంటామని తెలిపారు.

ఇలా ఉంటే మలేరియా మళ్లీమళ్లీ వచ్చును..

మార్కాపురం టౌన్/పొదిలి/కొనకనమిట్ల: ఓ వైపు మలేరియా అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తుండగా మరో వైపు ఆయా పట్టణాల్లో గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. అధికారులు కేవలం ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం కాదు.. ముందుగా పారిశుధ్య పనులను చేయించాలని ప్రజలు కోరుతున్నారు. మార్కాపురం పట్టణం, పొదిలి, కొనకనమిట్లలోని పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారైంది. దీంతో దోమలు వృద్ధి చెంది మలేరియా వ్యాప్తికి కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని అపరిశుభ్రంగా ఉన్న వీధులను శుభ్రం చేసి చెత్తను తొలగించాలని కోరుతున్నారు.


పొదిలి వెంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే రోడ్డులో నిలిచిన మురుగు


మార్కాపురంలో కూరగాయల మార్కెట్ వద్ద వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను తింటున్న పశువులు


పెదారికట్లలో సైడు కాలువల దుస్థితి ఇలా..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బేస్తవారిపేట: మార్కాపురం ఫీడర్‌లోని విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ డీఈఈ శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. రావిపాడు, పెద్ద ఓబినేనిపల్లె, ఉమ్మారెడ్డిపల్లె సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని చెప్పారు.